# కన్నీరా కారకే గోదారి వరదలొస్తాయి

– కన్నెగంటి (యలమాటి) అనసూయ

‘‘ఊ.. నోరు తెరవ్వేమే.. సరిగ్గా నోరు తెరవకపోతే ముద్ద ఎలాపెట్టను నోట్లో. ఆ దిక్కులు చూడ్డం ఏంటీ?’’ విసుక్కుంటు నెత్తిమీద మొట్టింది అమ్మ ఎడంచేత్తో.

బకాసురుడిలా నోరు తెరుస్తూ అమ్మవైపు తిరిగాను దెబ్బపడిన చోట చేత్తో రాసుకుంటూ.

పెద్ద ముద్ద నోట్లో కుక్కింది అమ్మ. నములుతూనే చుట్టూ చూశాను. అమ్మ నన్ను కొట్టటం అక్కలిద్దరూ చూసేసారేమోనని. తెలుగు పుస్తకాన్ని ముఖానికి అడ్డంగా పెట్టుకున్నారు. అంటే నవ్వుతున్నారన్న మాట. నవ్వటం అమ్మ చూస్తుందేమోనని పుస్తకం అడ్డం పెట్టుకున్నారు. నాకు ఉక్రోషం ముంచుకొచ్చింది.

‘‘అలాగే దిక్కులు చూడొద్దన్నాను. ఊపట్టు’’ అంది అమ్మ యింకో ముద్ద నానోటిదాకా తెస్తూ.

‘‘నాకొద్దు.. నేతినను. నన్నెందుకు కొట్టావ్. అదిగో వాళ్ళు చూడు ఎలా నవ్వుకుంటున్నారో. అమ్మ చేతిని పక్కకి తోస్తూ కోపంగా అన్నాను. నేనిలా అమ్మతో చెప్పేసరికే వాళ్ళిద్దరూ.. మేమేమీ నవ్వలేదన్నట్టు గణ గణా చదవటం మొదలుపెట్టారు.

‘‘మీకేం రోగం వచ్చిందే. చెల్లెల్ని కొడితే మీరు నవ్వుతారు. ఇప్పుడే ఇలా ఉంటే పెద్దయ్యాక ఎలా ఉంటారోగాని.. ఛా ఛా.. ఒకటే కాల్చుకు తింటున్నారు. మీ నాన్నవల్ల మనకెలాగూ సుఖంలేదు. కనీసం మీలో మీరన్నా సరిగ్గా ఉంటే.. నాకా మాత్రం.. సుఖం కూడా దక్కనియ్యరు. మీకిదేం పొయ్యేకాలమే’’ పళ్ళెం మోరిలో పడేసి చెయ్యి కడుక్కుని చెంగుతో కళ్ళద్దుకుంది.

నాకెందుకో భయంవేసింది ఆ విసుర్లో నన్నింకో రెండు చరుస్తుందేమోనని. మూతి కడుక్కుని ఎక్కాల పుస్తకం పట్టుకున్నాను.

‘‘అసలే దీపాలు పెట్టేవేళ. ఏంటా కన్నీళ్ళు పెట్టుకోవటం. నువ్వెంత ఏడిస్తేమటుకు.. ఆట మాని వచ్చేస్తాడా ఏవన్నానా.. పైగా అదేపనిగా పేకాట ఆడి ఆడి వస్తాడేమో.. రాగానే నువ్విలా కన్పిస్తే మరీ చిందులేస్తాడు. లే.. లేచి ముఖం కడుక్కో.’’ అమ్మమ్మ మాటలకి అమ్మ ఏడుపు మరింత ఎక్కువైంది.

‘‘మన తలరాత బాగోక.. ఇక్కడపడ్డాం. ఏం చేస్తాం. కర్మనుకోవటం వదిలెయ్యటం. మన విసుగుని పిల్లలమీద చూపిస్తే.. పాపం నోరూవాయా లేని.. కుర్రముండలు. వాళ్ళేం చేస్తారు చెప్పు.’’

‘‘నువ్వు బాగానే చెప్తావ్. నోటులు.. నోటులు రాసి అట్నించటే పేకాట్లో పెట్టి రావటమేకాని పిల్లల తలకి నూనుందా అని కూడా చూడరు. ఈ ముగ్గురు ఆడపిల్లల్తో నేనెలా బండిని లాగను దేవుడా..’’ అమ్మ చెంగులో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తుంది.

‘‘లేమ్మా! లే.. ఆ భగవంతుడే ఉన్నాడు. దారదే దొరుకుతుంది! నాకు మాత్రం.. బాధగా లేదా. కూతురి బతుకిట్టా అయిందేంటా అని. గుండెలు కోసుకుపోతున్నాయ్. ఎవరితో చెప్పుకోను?’’

అమ్మమ్మ కూడా అమ్మతో కల్సి రాగం తీసేసరికి ఏం చెయ్యాలో తోచక అక్కలవైపు చూసాను. అప్పటికే ఇద్దరూ ‘ఇదంతా నీవల్లే’ అన్నట్టు నావేపు కోపంగా చూస్తున్నారు.

నాకు ఉడుకుమొత్తనంగా ఉంది. బిక్కముఖమేశాను. ఛీ.. ఇదంతా నాన్నవల్లే. ఎందుకో.. ఎప్పుడూ ఆ పాకలో కూర్చుని చీట్ల పేకాడుతూనే ఉంటారు. టీచర్ ఏదన్నా నోట్‌బుక్ కొనమన్నా.. అక్కడికే వెళ్ళి అడగాలి. వెళ్ళినప్పుడల్లా.. ఏదో ఒకటి. ఏ పకోడిలో.. బజ్జీలో తింటూనే ఉంటారు. పాపం.. అమ్మేమో మాకూ.. అమ్మమ్మకి పెట్టి నాన్న ఎప్పుడొస్తే అప్పుడు నాన్న తిన్నాక.. మిగిల్తే తింటుంది. లేదంటే లేదు. పాపం అమ్మ.. నెమ్మదిగా పాక్కుంటూ అమ్మని చేరాను. కాలుమీద తలపెట్టి పడుకుని.. నెమ్మదిగా అమ్మ ముఖాన్ని పైకెత్తి,

‘‘అమ్మా.. రేపట్నుంచి.. దిక్కులు చూడకుండా అన్నం తినేస్తానే.. సరేనా.’’

అంత బాధలోనూ ఫక్కున నవ్వింది అమ్మ.

అంతే.. అమ్మ నవ్వు చూడగానే నాకు ఆనందం వచ్చేసి లేచి కూర్చున్నాను. ‘‘అంతేకాదమ్మా.. అమ్మా.. నువ్వు కొట్టినా.. అక్కలు నవ్వినా.. నేను ఏమీ అనుకోను. సరేనా.’’ అమ్మ నన్ను దగ్గరకి తీసుకుంది. అక్కలిద్దరూ.. అప్పటికే అమ్మ మెడ చుట్టూ చేతులేసేసారు.

‘‘రత్నాల్లాంటి బిడ్డలమ్మా! నారు పోసినోడే నీరూ పోస్తాడని.. అన్నింటికి పైవాడే ఉన్నాడు. లే.. లేచి ముఖం కడుక్కో.’’

అమ్మమ్మ నన్ను తీసుకుని కొబ్బరి చెట్టు క్రింద నులకమంచం మీద పడుకోబెట్టి పక్కనే తనూ సర్దుకుంటూ మెల్లగా నా చెవిలో గుసగుస లాడింది.

‘‘తెల్లారగట్ట బయల్దేరి వద్దిపర్రు చిట్టి మావయ్య యింటికెళుతున్నాంగాని పెందలాడే లేవాలి కదా.. నా బంగారం తొందరగా పడుకోమ్మా. రేప్పొద్దునే లేచి నీ పలకా, ఎక్కాల బుక్కూ, తెలుగువాచకం అన్నీ.. అదిగో బట్టల బుట్టమీద సంచి ఉంది చూడు దాన్లో సర్దేసుకో. యిక పడుకో.’’

‘‘అంతే.. నాకానందం ఆగలేదు. అప్పటికప్పుడే ఊరెల్తున్నట్టు అక్కలకి చెప్పెయ్యాలని లేవబోయి అంతలోనే పడుకున్నాను. ‘అమ్మో! ఒకవేళ వాళ్ళూ వస్తానని గొడవచేస్తే.. నా ప్రయాణం కూడా ఊడుద్ది.’ మెదలకుండా పడుకున్నాను ఎప్పుడు తెల్లారుద్దాఅని. చిట్టి మావయ్య ఊరెళ్ళటం అంటే నాకెంత యిష్టమో. యించక్కా.. ఆనకట్ట మీద నడవచ్చు. గౌనంతా తడుపుకోవచ్చు. చెట్లెక్కచ్చు. నాకా రాత్రంతా గోదారే కళ్ళముందు.

తెల్లవారు ఝామున అమ్మ వీధి ఊడ్చి కళ్ళాపి చల్లుతుంటే ఆ శబ్దానికి లేచి కూర్చుని అమ్మమ్మని లేపేశాను.

‘‘పెందరాడే లేస్తే ఎక్కడ స్కూలు కెళ్ళాల్సి వస్తుందోనని బారెడు పొద్దెక్కేదాకా దుప్పటి ముసుగుదన్ని మరీ నటించేదానివి. మావయ్య ఊరనేసరికి అసలు నిద్రపోయినట్టు లేవేమే. తెల్లవార్లూ ఒకటే కదలటం.. ఒకటే తన్నటం.’’

చిరుగుల దుప్పటి మడతపెడుతూ అమ్మమ్మ అన్న మాటలకి ముగ్గు డబ్బాకోసం లోపలికొచ్చిన అమ్మ నవ్వింది నన్ను చూస్తూ. అమ్మయ్య! అమ్మ

నవ్వేసింది. కోపం పోయిందన్నమాట అనుకుని గబగబా వేపపుల్ల తీసుకుని చప్పుడు చేయకుండా అరుగుమీదకి పోయాను ముఖం కడుక్కోవడానికి.

ఏ చిన్న చప్పుడైనా అక్కల్లేచేస్తారేమోనని నా భయం. లేస్తే.. వాళ్ళకి తెల్సిపోతుంది చిట్టి మావయ్య ఊరుకి అమ్మమ్మ నన్ను తీసుకెళ్తుందని.

అక్కలిద్దరూ.. లేవకముందే అమ్మమ్మా నేనూ సంచితో బయటికొచ్చేశాం. వచ్చేముందు అమ్మమ్మ అక్కలిద్దర్నీ ముద్దుపెట్టుకుని ఎంత విసుగొచ్చినా పిల్లల్ని కొట్టద్దని అమ్మతో చెప్పి మరీ వచ్చింది. సరేనంటూ వీధి చివరవరకూ వచ్చి అమ్మ మమ్మల్ని సాగనంపింది. ఎందుకో అమ్మా, అమ్మమ్మ మాట్లాడుకుంటూనే చెంగుతో కళ్ళు అద్దుకుంటున్నారు. నాకు నాన్న గుర్తొచ్చారు.

ధవళేశ్వరం ఆనకట్ట దగ్గర అమ్మమ్మ మూడు జాంపళ్ళు కొని రెండు సంచిలో వేస్తూ ఒకటి నాకిచ్చింది.

ముక్కలు ముక్కలుగా తింటే త్వరగా అయిపోతుందని ముందు పళ్ళతో గీరుతూ నెమ్మదిగా తినసాగేను.

వచ్చేసింది ఆనకట్ట. అబ్బ ఎంత నీరో. నాకు ఆనందంతో గంతులేయాలన్పించింది. జామకాయని సంచిలో పడేసి చేతులు గౌనుకి తుడిచేసాను.

ఎక్కడికీ వెళ్ళద్దని చెప్పి సంచి కిందపెట్టి అమ్మమ్మ అక్కడున్న పాక దగ్గరకి వెళ్ళింది. పాక ముందు ఒక టేబులూ, కుర్చీ వేసున్నాయ్. కుర్చీలో పంట్లాం తొడుక్కున్న తాత కూర్చుని ఉన్నాడు.

అమ్మమ్మ ఏదో అడుగుతుంటే తాత తల అడ్డంగా ఊపుతున్నాడు. ఏదోలే అనుకుని గోదారి వైపు తిరిగాను.

అబ్బ! ఎంత నీరో.. అడ్డుగా నిలబెట్టిన రేకుల వెనుక నిండు గోదారి. రేకులకి మరో పక్క సన్నని దారి. ఆదారికి ఒక పక్క నీటిని అడ్డుగా ఉంచిన రేకులయితే.. మరోపక్క అడుగు ఎత్తున్న సన్ననిగోడ. నీటికి అడ్డుగా ఉంచిన రేకుల జాయింట్ల వద్ద నుంచి విసురుగా వస్తున్న నీరు దారి మీదుగా వెళ్ళి అక్కడక్కడా అడుగు దూరం వదిలేసి కట్టిన సన్నని గోడ కాళీల్లోంచి జారి క్రిందపడి అలసి సేదదీరుదామన్నట్టు నిదానంగా ప్రవహించే గోదారి మధ్య మధ్యలో ఇసుక తిన్నెలతో.. తిన్నెలపై అక్కడక్కడా ఒత్తుగా పెరిగిన దర్భగడ్డి మొదళ్ళతో..

అంతా చూస్తూ యిసుకతో ఆడుకుంటున్న నేను అమ్మమ్మ రావటంతో సంచి దగ్గర కొచ్చాను. అమ్మమ్మ గొణుక్కుంటూ సంచిలో జాంపండు తీసి తాతకిచ్చి వచ్చింది.



''నెమ్మదిగబో ముసల్దానా.. కుర్రదాని జబ్బట్టుకో. జారినాదాంటే.. నా ఉజ్జోగం ఊడుద్ది.''

పంట్లాం తాతన్న మాటలకి నాక్కోపం వచ్చింది. మా అమ్మమ్మని ముసల్దానా అంటావా అని కోపంగా చూసాను.

వాడదేం పట్టనట్టు గోదారివైపు చూస్తూ జాంకాయ తింటున్నాడు.


ఆనకట్ట మీద నడవటానికి ముందు అమ్మమ్మ చెప్పింది నాకు 'జాగ్రత్తగా నడవమని. తొందరగా నడవమని'. ఎందుకంటే గవర్నమెంటోళ్ళు అలా నడవటం తీసేసారంట. ఎవరైనా ఆనకట్ట మీద నడిస్తే జైల్లో పెడతారంట. కాని చిట్టి మావయ్య యింటికి అని అమ్మమ్మ చెబితే ఒప్పుకున్నాడట.

కాళ్ళు జివ్వుమనేసరికి చక్కిలిగిలి పెట్టినట్లయింది. భయంతో అమ్మమ్మని పట్టుకొన్నాను. నాలుగడుగులు వేసేసరికి కొంచెం ధైర్యం వచ్చింది. అమ్మమ్మని వదిలేసి నేనే నడవగల్గాను.

''బొటనవేలు నేలకి గుచ్చి నడువు. లేదంటే నాచు మీద జారిపడిపోతావ్'' అమ్మమ్మ వెనకనించి అన్న మాటలకి కొంచెం వేగం తగ్గించి వేళ్ళు నేలకి గుచ్చి నడవసాగేను. రేకుల నెరల్లోంచి వచ్చే నీళ్ళవల్ల అప్పటికే గౌను సగం తడిచిపోయింది.


ఒక్కసారి తలతిప్పి కిందలోయలోకి చూడాలని ఉంది. అంతలోనే భయం... చుట్టూ నీరు. అంతా నీరే.. ఓరకంటితో భయం భయంగా లోయలోకి చూసాను. అంతే.. డుబుక్కున జారేను నాచుమీద. అమ్మమ్మ కంగారుగా లేవదీసింది. గౌనంతా నల్లగా అయిపోయింది నాచు అంటి.

అమ్మమ్మవైపు భయంగా చూసాను తిడుతుందేమోనని.



# ఎగిరే చేప!

చేపలు నీళ్లల్లో జలకాలాడ్డం, పల్టీలు



కొట్టడం చూశాం, విన్నాం. అయితే, చేపలు ఎగరడం చూశ్భేదుగదూ! నిజమే. ఎగిరే చేపలు ఉన్నాయి. సదరు చేప పేరు 'హాట్‌చెట్'. నిజానికి ఇది అతి బుల్లిచేప. 70 మి.మీ. (3 అంగుళాలు) పొడవు మాత్రమే ఉంటుంది. దానికి పెద్ద చేపలవల్ల ప్రమాదం ఏర్పడినప్పుడు ఒక్క ఉదుటున నీళ్లనుంచి పైకి ఎగురుతుంది. 5 అడుగుల దూరం వరకూ అది ఎగరగలదు. ఈ చేపలు దక్షిణ అమెరికాలోనూ, ఎక్వేరమ్‌లలో లభిస్తాయి.

# కులాసా పురుషుల పనిపట్టే జెల్!

జపాన్‌లో ఈమధ్య ఓ జెల్ కనిపెట్టబడింది. ఈ జెల్‌వల్ల భార్యల కళ్లుగప్పి బయట ప్రణయకలాపాలు జరిపే పురుష పుంగవుల సెక్స్ కార్యక్రమాలు బట్టబయలు అవుతాయి. పతిదేవుడి వీపుమీద జెల్ రహస్యంగా అర్ధాంగి పూస్తుంది. అతను ధరించిన దుస్తులపై కొత్తగా కనిపెట్టబడిన ఓ స్ప్రేతో స్ప్రే చేస్తుంది. భర్త ఇంటికి తిరిగివచ్చాక, అతను స్నానం చేసిన తర్వాత అతని శరీరంపై ఎర్రటి రంగు కనిపిస్తేచాలు, బయట శ్రీవారు ప్రణయ కలాపాలు జరిపినట్లుగా శ్రీమతిగారు గ్రహిస్తారు. అలాగే భర్తల దుస్తులు నీళ్లలో తడవగానే రంగు మారితే, అతను ప్రేమ యొక్క రసకందాయంలో మునిగి వచ్చాడని సగభాగం తెలుసుకొంటుంది. ఆనక ఆ మొగాయన పడేపాట్లు...

ఆ జెల్‌లు, స్ప్రేలు మనదేశానికిగానీ వస్తే ఇంతేసంగతులు. ఎంతమంది ఆట కడుతుందో, ఇది తెలుసుకొని ఎంతమందికి 'ప్రేమచెమట్లు' పడతాయో గదూ!

- కొడిమెల

అమ్మమ్మ మంచిది. ఏమీ అనలేదు. కాని నన్ను ఒక్కదాన్నీ వదలక తనేపట్టుకుని నెమ్మదిగా నడిపించసాగింది. ఇంకో నాలుగడుగులు వేస్తే గట్టు వచ్చేస్తుందనగా అమ్మమ్మ చేయి వదిలించుకుని నీళ్ళు నిలిచిన చోటల్లా అడుగులు వేస్తూ గట్టు వేపు పరుగుపెట్టాను.

''అమ్మమ్మా! నీకంటే నేనే ఫస్టు'' గట్టుమీద నిలబడి తప్పట్లు కొడుతూ అన్నాను. అమ్మమ్మ నవ్వింది.

అమ్మమ్మకి ఆయాసం వచ్చినట్టుంది. రాయిమీద కూర్చుని చెంగుతో ముఖం తుడుచుకుంది. వెళ్ళి అమ్మమ్మ ఒడిలో కూర్చున్నాను. ఎందుకో అమ్మమ్మని చూస్తే జాలేసింది నాకు. గబగబా సంచి వెదకి జాంకాయ తీసి అమ్మమ్మకిస్తూ సగం తిన్న నాకాయని నేతీసుకున్నాను.

''వద్దు.. సంచిలో వేసేయ్. మనం యింకో ఆనకట్ట మీద నడవాలి. అక్కడ యింకో తాత ఉంటాడు. ఈకాయ ఆ తాతకిస్తేనే మనల్ని దానిమీద నడవనిస్తాడు. ఎలాగూ మనకాడ డబ్బుల్లేవుకదా!'' అంది నా తలని తన గుండెలకాన్చుకుంటూ.

నాకెంతో ఆనందంగా ఉంది. ఎదురుగా నాకిష్టమైన గోదారి. పక్కనే కొండంత అమ్మమ్మ. జాంకాయ కొరికాను. ఉప్పగా తగిలింది నోటికి.

''అమ్మమ్మా! ఇందాక తిన్నప్పుడు బాగానే ఉంది. ఇప్పుడు ఉప్పగా ఉంది ఎందుకు?'' వడిలో కూర్చునే తలెత్తి అమ్మమ్మవైపు చూస్తూ అడిగాను.


అమ్మమ్మ ఎందుకేడుస్తుందో అర్థంకాలేదు.

అమ్మమ్మ కన్నీళ్ళు కాయ మీదపడ్డాయని నాకేం తెల్సు. సంచిలో పడేసి అమ్మమ్మవైపు తిరిగాను.

''యిందాక.. నేను జారిపడిపోయానని ఏడుస్తున్నావా అమ్మమ్మా. దెబ్బతగల్లేదు. చూస్తావా?'' అంటూ గౌనెత్తి కాలు చూపించాను.

''యింకో ఆనకట్టమీద పడకుండా నడుస్తాన్లే.. సరేనా!'' నా లేతచేతుల్తో అమ్మమ్మ చెంపలమీద జారుతున్న కన్నీళ్ళని తుడుస్తూ అన్నాను.

''యిది.. యిది ఏడుపు కాదమ్మా!'' చెంగుతో కళ్ళొత్తుకుంటూ అమ్మమ్మ అన్న మాటలకి కోపంగా చూసాను అబద్ధం చెబుతుందని.





''యిలా కళ్ళ నుండి నీళ్ళొస్తే ఏడుపనే అంటారు. మరి నాన్న నన్ను కొట్టినపుడు నాకిలా కంటి నుండి నీళ్ళొస్తేనేగా అమ్మ నన్ను ఏడవకు ఏడవకు అని ఊరుకోబెట్టేది. అబద్ధం చెబుతున్నావ్ కదా అమ్మమ్మా!''

''యిది.. ఏడుపు కాదమ్మా! పాపం గోదావరిని ఆరేకుల వెనుక బంధించేశారు గదా ఎక్కడికీ పోనీయకుండా. ఆ నీరంతా అక్కడ పట్టక.. యిదివరకు నేను చిట్టి మావయ్య యింటికెళ్ళినపుడు యిలాగే వెళ్ళాను. అప్పుడు నన్నడిగి నాదగ్గర కొంత దాచుకుంది. యిప్పుడు మళ్ళీ వెళ్తూ కన్పించాకదా. తన నీరు తనకిచ్చెయ్యమంటే యిస్తున్నా అన్నమాట.''

''ఓహో.. అదా సంగతి'' అన్నాను. అమ్మమ్మ నన్ను లాక్కుని ముద్దుపెట్టుకుంది. ''అమ్మమ్మా! మరి.. మరి.. అమ్మ దగ్గర కూడా కొంత నీరు దాచుకుందా గోదారి.''

అమ్మమ్మ ముఖం అదోలా అయిపోయింది. నన్ను లాక్కొని ముద్దుపెట్టుకున్నప్పటిలా లేదు.

ఛ.. అలా అడక్కుండా.. ఉండాల్సింది. అయినా... అమ్మక్కూడా అప్పుడప్పుడు యిలా కళ్ళవెంట నీళ్ళు రావటం గుర్తొచ్చి అడిగాను. తప్పేంటి.

అమ్ముంటే ఎంత బాగుండును. అమ్మని చూడాలనుంది.

అమ్మమ్మ వెనకే బయల్దేరాను. కొంచెంసేపు నడవగానే.. రెండో ఆనకట్టొచ్చేసింది. ముందు దానిమీద నడవటం వల్లనుకుంటా భయం పోయింది. అమ్మమ్మ అరుపుల్ని లెక్కచేయకుండా పరుగు మొదలెట్టా. సరిగ్గా.. మధ్యకెళ్ళి ఉంటామేమో..

వెనుక నుంచి ''అమ్మా!'' అనే కేక వినపడి పరుగాపి వెనక్కి చూశా. అమ్మమ్మ పడిపోయింది. వేళ్ళు నేలకి గుచ్చి మరీ నడవమని చెప్పిన అమ్మమ్మ.. తనే పడిపోయింది.. పాపం.

నీళ్ళలో జారి అడుగున్నర ఎత్తున్న గోడదగ్గర ఆగిపోయింది దాన్ని పట్టుకుని. లేదంటే క్రిందకి జారిపోయేదే. పైట జారి నీళ్ళలో కిందకు పోయి ఏటవాలుగా సిమెంటు చేసి నాచుపట్టి ఉన్నచోట నీళ్ళలో తడుస్తు వేళ్ళాడుతోంది.

సంచి అప్పటికే కిందకి జారిపోయి నీళ్ళలో కొట్టుకుపోతూంది. అయ్యో! ఎక్కాలు యింకా రానేలేదు. అప్పుడే పుస్తకం పోయింది. పాపం.. అసలే అమ్మమ్మకు చీరల్లేవు.

ఎంత ప్రయత్నించినా లేవలేకపోతుంటే గబగబా వెళ్ళి చేయందించాను. ''వద్దు.. జాగ్రత్తగా పైకి వెళ్ళిపో. నేవచ్చేస్తాను.. పద.''

బిక్కముఖమేసుకుని నిలబడ్డ నన్ను అమ్మమ్మ తొందరచేసింది.

నాకేంచేయాలో తోచక దిక్కులు చూస్తూ బిగ్గరగా ఏడ్చేశాను. అమ్మమ్మ యింక లేవలేదని నాకర్థం అయిపోయింది. నిజంగానే.. లేవలేకపోతే.. బాబోయ్.. యింకేమైనా ఉందా. గట్టిగా.. మరింత గట్టిగా ఏడ్చాను.

యింతలో ఎవరో ముగ్గురు పెద్దాళ్ళు తలకి పాగా చుట్టుకుని పంచె కట్టుకున్నారు. చొక్కా వేసుకోలేదు. పరుగు పరుగున వస్తూ కన్పించారు. ఏడుపు ఆపి

వాళ్ళవేపు, అమ్మమ్మవేపు మార్చి మార్చి చూస్తు న్నాను 'తొందరగా రండి. లేదంటే అమ్మమ్మ కిందకె ళ్ళిపోతుంది' అన్నట్టు. అందులో ఒకడు నన్ను పట్టుకోగా మరో ఇద్దరు అమ్మమ్మ రెండు చేతులూ పట్టుకుని అమ్మమ్మని నిలబెట్టారు. అమ్మమ్మ కాలొకటి నేలమీద నిలబడటంలేదు. అమ్మమ్మ.. బాధగా అరుస్తూంది 'అబ్బా' అని.

నాకు ఆనకట్టమీద, గోదారి మీద కోపమొచ్చింది. నీళ్ళు దాచిపెట్టినా.. పాపం.. అమ్మమ్మని నడవకుండా చేసాయి. ఉక్రోషంతో ఆనకట్టని కసిదీరా తన్నాను. నీళ్ళు చింది ముఖం మీద పడ్డాయ్.

ఇద్దరూ చెరో రెక్కా పట్టుకుని అమ్మమ్మని గట్టుమీదకి లాక్కుపోయారు.

చిట్టి మావయ్య పేరు చెప్పగానే ఎడ్లబండిలో గడ్డి వేసి చాపు పరిచి అమ్మమ్మనీ నన్నూ అందులో ఎక్కించారు.

''అసలే ముసిల్దానివి. తోడు ఈ కుర్రదొకటి. ఏ గట్టయినా ఇరిగితే.. ఏటి బతుకు?'' అంటూ తలొకటీ అంటున్నా అమ్మమ్మ ఇవేవీ వింటున్నట్టు లేదు. దూరంగా ఎటో చూస్తూంది. నేనూ అటువేపు చూసాను. సంచి.. నీళ్ళల్లో కొట్టుకుపోతూ నలకలా కన్పిస్తుంది. మూడో ఎక్కం రానేలేదు అప్పుడే పుస్తకం పోయింది. ప్చ్.

గోల గోలగా ఇరుగూ పొరుగూ అంతా వచ్చి చుట్టూ చూస్తుండగా అమ్మమ్మని బండిమీద నుండి దింపారు.

''పిల్లన్నేసుకుని ఆనకట్టలమీద నడవొద్దు. లాంచీల్లో రా అని ఎప్పటికప్పుడు డబ్బులిస్తూనే ఉన్నా. నడవటం మానదు. మమ్మల్ని ప్రజల నోళ్ళల్లో ఎవరేస్తారు ఈ ముసల్ది లాంచిలోవస్తే.''

మా బళ్ళో గంటలా అత్తయ్య గొంతు ఖంగుమంది. మావయ్య మాట్లాడకుండా డాక్టరుకి కబురంపాడు.

నేను అమ్మమ్మ మంచం దగ్గరే కూర్చున్నాను. నన్నెవరూ పట్టించుకోలేదు. డాక్టరుగారు మావయ్య.. దూరంగా పాకలోకెళ్ళి ఏవేవో గుసగుసలాడుకున్నారు. వెదురుబద్దలేసి కాలిని గట్టిగా కట్టేశారు లేవడానికి లేకుండా.

మర్నాడు అమ్మ వచ్చేసింది గోల గోలగా ఏడుస్తూ. ఎవరెవరో వస్తున్నారు. పోతున్నారు. ఆనకట్టమీద నడిచినందుకు తిడుతూనే ఉన్నారు. మధ్య మధ్యలో పంతాలం తాతని కూడా తిడుతున్నారు మమ్మల్ని ఆనకట్టమీద నడవనిచ్చాడని.

నేరేడు చెట్టు చుట్టూ తిరుగుతున్న నేను అమ్మమ్మ పిలిస్తే దగ్గరకెళ్ళాను. యింకా దగ్గరగా రమ్మంది. కట్టుని చూస్తూ ఒళ్ళో కూర్చున్నాను. నాతల నిమిరింది.

అమ్మమ్మ కళ్ళవెంట నీరు.

''అమ్మమ్మా! ఆనకట్ట దగ్గర్నుంచి మావయ్య యింటికి వచ్చేశాం కదా! అయినా గోదారి తన నీళ్ళు తనకిచ్చెయ్యమందా?''

కొంతసేపటి వరకూ అమ్మమ్మ ఏం మాట్లాడలేదు. కొంచెంసేపటికి అంది-

''మరేమో.. నాదగ్గర దాచుకున్న మొత్తం నీరు యిచ్చెయ్యమంది కదా! ఆనకట్ట దగ్గరున్నప్పుడు కొంతే ఇచ్చాను. యింటి దగ్గర ఆపనీ ఈపనీ చేస్తూ తననీరు తనకివ్వటం మర్చిపోతానేమోనని యిలా శాశ్వతంగా మంచం మీద పడుకుని ప్రతిరోజూ కొంత కొంత ఇవ్వమందన్నమాట.''.

అంతే ఆ తర్వాత మరెప్పుడూ అమ్మమ్మతో కల్సి ఆనకట్టమీద నడవలేదు నేను.

అమ్మమ్మ మాత్రం ఆ మంచం మీద పడుకొని గోదారి మట్టాన్ని అలా పెంచుతూనే ఉంది.

• • •

''యిదేనమ్మా! కాటన్ దొరగాని విగ్రహం.'' పాతికేళ్ళ తర్వాత కాటన్ బేరేజ్ మీద కారులో వెళుతూ ఆఖరిసారిగా అమ్మమ్మతో గడిపిన క్షణాల్ని గుర్తుతెచ్చుకున్న నేను డ్రైవర్ మాటలతో ఇహలోకి వచ్చాను.

గుర్రంపై ఠీవిగా కూర్చున్న కాటన్‌దొర. ఆయన్నలా చూస్తున్నకొద్దీ హృదయపు తడి కళ్ళను చేరుతూంది.

భూమ్యాకాశాలున్నంతకాలం కోస్తా ప్రజలు తప్పక రుణపడి ఉండాల్సిన వ్యక్తి. ఆంగ్లేయులను ఒప్పించి అఖండ మేధతో అంతంత మాత్రంగా ఉన్న భూమిని సస్యశ్యామలం చేసిన మహామనీషి. ఏమిచ్చి.. తీర్చుకోగలదయ్యా ఈ ప్రజ నీ రుణాన్ని.

రెండు చేతులెత్తి మనసారా నమస్కరించాను.

''ఎన్నో కఠిన పరీక్షలకి నిలబడి.. నీవు సాధించిన విజయంతో.. అందలాలెక్కిన ఈప్రజే.. తమ పిల్లలకైనా నీ గురించి.. చెబుతారంటావా?''

కారు బయల్దేరిన రెండు నిమిషాలకే ఆ ప్రశ్నకి సమాధానం దొరికింది. ఎవరో యాత్రికులనుకుంటా గుంపుగా నిలబడి పళ్ళూ పైసలూ ప్రవాహంలోకి విసురుతున్నారు పక్కనున్న బిచ్చగాడ్ని పట్టించుకోకుండా.

'ఆకలితో అలమటిస్తున్న తోటి మనిషి ఆకలి కేకల్ని గాలికి వదిలి కాసుల్ని ఫలాల్ని నిరుపయోగంగా నదిలోకిసిరే మూఢులున్నంత కాలం... నీవు ఒట్టి శిలవే దొరా!'

అనుకుంటూ నిట్టూర్పు విడిచి..

అమ్మమ్మ జ్ఞాపకాలను.. హృదయ పొరల్లో పదిలంచేసాను.

★

## మీనా కోరిక



సౌందర్య, రమ్యకృష్ణ దేవతలుగా నటించి ఎంతో పాపులార్టీ తెచ్చుకున్నారు. మీనాకు ఎప్పటి నుండో అమ్మవారిగా నటించాలని కోరిక ఉండేది. అయితే తమిళంలో 'పాలయత్తి అమ్మన్' చిత్రంలో మీనా కోరిక తీరిపోయింది. అదే చిత్రాన్ని 'దేవత'గా తెలుగులో డబ్ చేస్తున్నారు. ఏసేవే! మీనా నీ కోరిక తీరిందిగా! ఇక హేపీనా?

## సిమ్రాన్ కోరిక

సిమ్రాన్‌కి కంప్యూటర్ కోర్స్ చేయాలని తెగ కోరికగా ఉందిట. ఎక్కడా టైమే దొరకటం లేదుట. ఏ మాత్రం వీలు దొరికినా ఇంటర్‌నెట్ ద్వారా నేర్చుకోవాలని ఆనందపడిపోతోందిట. మరి ఎప్పుడు తీరుతుందో ఆమె కోరిక!

## రెమ్యూనరేషన్ పెంచిన ఐశ్వర్య

కాస్త హిట్‌టాక్ వస్తే చాలు హీరోయిన్స్ గానీ, హీరోలు గానీ టక్కుని రెమ్యూనరేషన్స్ పెంచి పారేస్తారు. 'హమ్ దిల్ దే చుకే సనమ్', తాళ్, జోష్ చిత్రాలు విజయవంతం కావడంతో ఐశ్వర్యారాయ్ తన రెమ్యూనరేషన్ ని పెంచి, నిర్మాతల్ని ఇబ్బంది పెట్టేస్తోందిట. అవున్మరి! దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టేసుకోవాలి కదా!

- విరాజి

